క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి



మాట్లాడుతున్న మదన్‌మోహన్

జి.సిగడాం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కొత్తపెంట యూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మజ్జి మదన్‌మోహన్ కోరారు. పిల్లల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయలు ఉన్నాయన్నారు. సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, నాయకులు పున్నాన అక్కలనాయుడు, నారాయణరావు, శ్రీనివాసరావు ఉన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు సత్కారం



సత్కారం పొందిన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

రణస్థలం: అర్జునవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలతో బుధవారం సత్కరించారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థినులు పాతర్లపల్లి మహా, బాబి ప్రత్యూష, రెడ్డి గాయిత్రిలకు గ్రామ సర్పంచ్ మీసాల లక్ష్మీ రామునాయుడు సత్కరించి నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బి.రామునాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

లావేరు: పశువుల వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని తాళ్లవలస సచివాలయం వెటర్నరీ అసిస్టెంట్ జి.లక్ష్మీకాంతం అన్నారు. రావివలస గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువులకు వ్యాధులు రాకుండా ముందస్తుగా వ్యాధినిరోధక టీకాలు వేశారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ర్యాలీ



జి.సిగడాం: డీఆర్‌వలసలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం: మండలం పరిధిలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జనాభాగిదారి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు ర్యాలీలు చేశారు. మాతాశిశు మరణాల తగ్గింపునకు సహకరించాలని నినాదాలు చేశారు. బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే మాతా శిశు మరణాలను తగ్గించవచ్చన్నారు.


వెంకటాపురంలో పారిశుద్ధ్య పనులు



చెత్తను తొలగిస్తున్న దృశ్యం

లావేరు: వెంకటాపురం గ్రామంలో బుధవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ బొంతు అరుణ, పంచాయతీ కార్యదర్శి కె.రామక్రిష్ణల పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు కాలువల్లో పూడికల తొలగింపు, జనావాసాల మధ్య చెత్త కుప్పలు, పిచ్చిమొక్కలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంతు ఎల్లంనాయుడు, వార్డు సభ్యుడు వావిళ్ల రామారావు, వలంటీరు పుష్పారావు పాల్గొన్నారు.

నేత్రదానం



కార్నియాలను సేకరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని తుమ్మావీధిలో నివాసముంటున్న బత్తుల కుసుమాంబ (83) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. దీంతో ఆమె నేత్రాలను రెడ్‌క్రాస్ నేత్ర సేకరణ కేంద్రానికి కుటుంబ సభ్యులు దానం చేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ద్వారా కార్నియాలను సేకరించారు.

పక్కా భవనాలే అభివృద్ధికి నిదర్శనం



సచివాలయ భవనం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్

రణస్థలం: ప్రజలకు సంక్షేమ పథకాలు సత్వరమే అందించాలనే దృఢ సంకల్పంతో గ్రామ సచివాలయాల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. ప్రతి ఊర్లో కనిపిస్తున్న పక్కా ప్రభుత్వ భవనాలే గ్రామాలాభివృద్ధికి నిదర్శనమన్నారు. క్రిష్టాపురం పంచాయతీ గొర్లెపేట గ్రామంలో రూ. 40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం భవనాలను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయాల్లో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్న కొన్ని క్షణాల్లోనే మంజూరు చేస్తున్నారని, ఆరోగ్యశ్రీ కార్డు, పింఛన్, కుల ధ్రువీకరణ పత్రాలు ఏది కావాలన్నా వలంటీర్లే వచ్చి వివరాలు నమోదు చేసుకొని గ్రామ సచివాలయాల ద్వారా గంటల వ్యవధిలో అందజేస్తున్నారన్నారు. అలాగే గత ప్రభుత్వాలు విస్మరించిన రైతన్నలను జగనన్న ఆదుకున్నారన్నారు. విత్తనాలు, ఎరువుల కోసం రోజుల తరబడి క్యూలైన్లలో నిలబడి కొనుగోలు చేసే పరిస్థితి గతంలో ఉండేదని, ప్రస్తుతం గ్రామ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రానికి రైతు దర్జాగా వెళ్లి కావాల్సిన ఎరువులు, విత్తనాలు తెచ్చుకుంటున్నారన్నారు. ఇదే కదా రాజన్న రాజ్యం ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం అందించి ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపీడీవో ఆర్.వి.రమణమూర్తి, పంచాయతీరాజ్ డీఈ సీతంనాయుడు, జేఈ కూర్మనాథం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, క్రిష్టాపురం సర్పంచ్ కంబవు రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, మైలపల్లి కామరాజు, కిల్లారి రమణ, గొర్లె అప్పలనర్సునాయుడు, మహంతి చినరామినాయుడు, గొర్లె శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ పాలన



ప్రజలకు సంక్షేమాన్ని వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలో ప్రజాసంక్షేమ పాలన కొనసాగుతోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. చిలకపాలెం గ్రామ సచివాలయం పరిధి జరజాపుపేట, అవనాపుపేట, యాతపేట, మునిపేట గ్రామాల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని వివరించారు. రేషన్ కార్డు వారీగా ప్రజలకు వర్తించిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేశామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ సాహసోపేత నిర్ణయమన్నారు. చంద్రబాబు తప్పుడు మ్యానిఫెస్టోలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నా.. ఎవరూ నమ్మే పరిస్థితులో లేరన్నారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో రమాదేవి, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షులు సనపల నారాయణరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మాడుగుల మురళీధర్‌బాబా, స్థానిక సర్పంచ్ డొంక ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు రోజారాణి, నాయకులు డొంక వెంకటరమణ, వెంకునాయుడు, బగ్గు రాజారావు, సీరపు శ్రీరాంమూర్తి పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



సచివాలయం వద్ద నివేదికలు తయారు చేస్తున్న అధికారులు

గార: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ మంచినీటి సరఫరాపై ఉన్నతాధికారులు సమీక్షించారు. ఇందులో భాగంగా రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడులో పనులను పరిశీలించారు. జేజేఎం పర్యవేక్షణాధికారి సీహెచ్ విద్యాప్రణయదీప్, ఏంజల్ ప్రణయదీప్, జిల్లా పర్యవేక్షణ సమన్వయకర్తలు డి.దాలినాయుడు, ఎస్.మురళీమోహన్ గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడారు. పైప్‌లైన్లు, ట్యాపులను పరిశీలించారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల వద్ద మంచినీటి పరిస్థితిపై ఆరా తీశారు. పంచాయతీ సిబ్బందికి పలు ప్రశ్నల వేసి సమాధానాలు రాబట్టి నివేదికలను ఆన్‌లైన్‌లో పొందుపరిచారు. ప్రతీ ఇంటికి శుద్ధ జలం అందించేందుకు ప్రభుత్వ నిర్ణయించినందు వలన దీనిపై ప్రజల నుంచి స్పందన తెలుసుకునేందుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీనివాసరావు, గొలివి గోవిందరావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈఈ కింజరాపు వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఎం.రాము, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ మైత్రి ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఉద్యోగులు

రణస్థలం: అగ్ని ప్రమాదాల నియంత్రణపై అందరూ అవగాహన కలిగి ఉండాలని రణస్థలం అగ్నిమాపక కేంద్రాధికారి పైలా అశోక్ అన్నారు. కోష్ట గ్రామంలోని ఎల్.అప్పలనాయుడు పెట్రోల్ బంకులో అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన నివారణ అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాల నివారణ పరికరాల వినియోగం అవగాహన కల్పించారు. రసాయనిక ప్రమాదాలు, అధికంగా మండే గుణం ఉన్న పెట్రోల్, డీజిల్, ఆయిల్ వంటి ద్రవ పదార్థాలు మండేటప్పుడు నియంత్రణకు ఫోమ్‌ను తప్పనిసరిగా వాడాలన్నారు. ఇంట్లో గ్యాస్, ఎలక్ట్రికల్ వస్తువులు మండేటప్పుడు ఇసుక వంటి ఘన పదార్థాలతో ఆర్పాలే తప్పా నీటిని అన్ని వేళలా వినియోగించరాదన్నారు. అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

రక్తదాతలకు సత్కారం



రక్తదాత పి.శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం కల్చరల్: అత్యధికసార్లు రక్తదానం చేసిన దాతలకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ బుధవారం సత్కరించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా వీరిని గోల్డ్ ప్లేటెడ్ మెడల్స్, జ్ఞాపికలతో సన్మానించారు. అలాగే జిల్లా యూత్ రెడ్‌క్రాస్, జూనియర్ రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదానంపై చైతన్యం కలిగించడానికి ప్రతిజ్ఞా పత్రాలను రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు ఆవిష్కరించారు. పురుషుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఏడురోడ్ల కూడలి వరకు సైకిల్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారిణి బి.మీనాక్షి, అదనపు వైద్యాధికారిణి అనూరాధ, రెడ్‌క్రాస్ సెక్రటరీ బి.మల్లేశ్వరరావు, ఎంసీ మెంబర్ పి.శ్రీకాంత్, కె.సత్యనారాయణ, బి.సతీష్ ఉన్నారు.

జేవీకే కిట్లు పంపిణీ



లావేరు: కానుకలను అందజేస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

లావేరు: అప్పాపురం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సర్పంచ్ జగ్గురోతు నాగరత్నం, వైఎస్సార్‌సీపీ నాయకులు జగనన్న విద్యాకానుక కిట్లను బుధవారం పంపిణీ చేశారు. నాయకులు జగ్గురోతు సత్యనారాయణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ ప్రక్రియ కుప్పిలి పాఠశాలలో చేపట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షురాలు బల్లాడ హేమమాలినిరెడ్డి, మాజీ ఎంపీపీ జనార్దరెడ్డి విద్యార్థులకు కిట్లను అందజేశారు.

రుణాలు రెన్యువల్ చేసుకుంటే వడ్డీ రాయితీ వర్తింపు

జి.సిగడాం: ఖరీఫ్ సీజన్‌లో తీసుకున్న పంట రుణాలను రైతులు సకాలంలో రెన్యువల్ చేసుకుంటే వడ్డీ రాయితీ వర్తిస్తోందని జి.సిగడాం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు అన్నారు. నాగులవలస, పెంట, మద్రివలస గ్రామాల్లో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఏడాదిలో తీసుకున్న రుణాలను మూడు రోజుల్లోగా రెన్యువల్ చేసుకోవాలని.. ఆ సమయం దాటిపోతే వడ్డీ వర్తించదన్నారు. పీఏసీఎస్ పరిధిలోని 28 గ్రామాల్లో అర్హులైన వారికి వివిధ రంగాల అభివృద్ధికి, పంట రుణాలు మంజూరు చేస్తామన్నారు. గత ఏడాది కంటే ఈస్తారి ప్రత్యేక రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు బూరాడ వెంకటరమణ, సర్పంచులు చిత్తిరి మోహన్, పున్నాన అక్కల నాయుడు ఉన్నారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రాలు అందజేస్తున్న మంత్రి ధర్మాన

శ్రీకాకుళం రూరల్: పెదపాడులోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలుగా ఎంపికైన గార మండలానికి చెందిన పలువురుకి నియామక పత్రాలను మంత్రి ధర్మాన ప్రసాదరావు బుధవారం అందజేశారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా మాతా శిశు సంరక్షణలో భాగాం కావాలని కార్యకర్తలకు మంత్రి సూచించారు. గార ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రాధామాధవి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, గురుగుబెల్లి లోకనాధం ఉన్నారు.

విజయగణపతిని దర్శించుకున్న స్వామిజీ



పూజలు చేస్తున్న స్వామిజీ

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులోని విజయగణపతి ఆలయాన్ని విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సర్వస్వతి స్వామిజీ బుధవారం దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, వెంకటనగేష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు స్వామిజీకి స్వాగతం పలికారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హేమమాలినిరెడ్డి తదితరులు

లావేరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిఇంటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నారని రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ కార్పొరేషన్ చైర్మన్ బల్లాడ హేమమాలినిరెడ్డి అన్నారు. పెదలింగాలవలస గ్రామంలో సర్పంచ్ లుకలాపు యశోద, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అప్పలనాయుడులు ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి జగనన్న ప్రజాసేవ కార్యాలయాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా హేమమాలినిరెడ్డి మాట్లాడుతూ.. దివంగత రాజశేఖరరెడ్డి ఎలా సంక్షేమ పాలన చేసి ప్రజాభిమానాన్ని సంపాదించారో అంతకంటే రెట్టింపుస్థాయిలో ఆయన తనయుడు.. సీఎం జగన్ ప్రజా సంక్షేమ పాలన చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేసి వలంటీర్ల ద్వారా నేరుగా ఇంటికే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, ఎచ్చెర్ల మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దనరెడ్డి, లావేరు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మీసాల అప్పారావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వట్టి సత్యనారాయణ, ధర్మవరం సర్పంచ్ అల్లు కన్నబాబు, మాజీ సర్పంచ్‌లు గొర్లె రామినాయుడు, శివాంగం నాగరాజు, లావేరు హైస్కూల్ పీఎంసీ చైర్మన్ లంకలపల్లి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో మెరుగైన ర్యాంకులు



హరిచందనకు మిఠాయి తినిపిస్తున్న తల్లిదండ్రులు



సాయిచరణ్‌తో తల్లిదండ్రులు



వావిలపల్లి కాంచన



వీఎస్ సాయినిమిలిత



ఎన్.సాహితి

జి.సిగడాం: మండలానికి చెందిన విద్యార్థులు నీట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించారు. పెంట గ్రామానికి చెందిన మక్క హరిచందన 720 మార్కులకు 658 సాధించి ఆలిండియా స్థాయిలో 1179, ఓబీసీ కేటగిరీలో 298 ర్యాంకు తెచ్చుకున్నారు. తండ్రి శ్రీనివాసరావు, తల్లి సంధ్యారాణి ఇద్దరూ ఉపాధ్యాయులే. ఇంటర్‌లో 957 మార్కులు సాధించారు. అలాగే ఆనందపురం గ్రామానికి చెందిన చిత్తిరి సాయిచరణ్ 617 మార్కులు సాధించడం ద్వారా జాతీయస్థాయి వోబీసీ కేటగిరీలో ఎనిమిది వేల ర్యాంకు సాధించాడు. ఇంటర్‌లో 968 మార్కులు తెచ్చుకున్నాడు. తండ్రి అచ్చినాయుడు వ్యవసాయదారుడు, తల్లి జ్యోతి అంగన్‌వాడీ కార్యకర్త.

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: నీట్ ప్రవేశ పరీక్షలో శ్రీకాకుళంలోని శ్రీచైతన్య విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు మెరుగైన ర్యాంకులు సాధించారని డీన్ కె.మురళీధర్, ఏజీఎం పి.నర్సునాయుడు తెలిపారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను బుధవారం అభినందించారు. వావిలపల్లి కాంచన 720 మార్కులకుగాను 681 సాధించి టాపర్‌గా నిలవగా, వాడాడ సాయి నిమిలిత 616, నల్ల సాహితి 577, నర్సిపురం శిరీష 532, బందారు గౌతమ్ తృషి 521 మార్కులు సాధించారని చెప్పారు.

ఆధునిక వైద్య సేవలందించండి



ఆస్పత్రిని ప్రారంభించిన అనంతరం వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

- మంత్రి ధర్మాన ప్రసాదరావు
- వి-డెంటల్‌లో స్కిన్ అండ్ హెయిర్ విభాగం ప్రారంభం

అరసవల్లి: ప్రస్తుత సమాజంలో అందరికీ జుత్తు సమస్యలు తలెత్తుతున్నాయని, వివిధ ఒత్తిళ్ల కారణంగా చాలామంది ఇబ్బందులు పడుతున్నారని..అటువంటి సమస్యల పరిష్కారానికి ఆధునిక వైద్య పరికరాలతో నయం చేసేలా వైద్యులు పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు సూచించారు. శ్రీకాకుళంలోని కృష్ణాపార్కు వద్ద వి-డెంటల్ ఆస్పత్రిలో స్కిన్ అండ్ హెయిర్ కాస్మోటిక్ విభాగాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. దంత వైద్య సేవలతో పాటుగా చర్మ, జుత్తు సమస్యల పరిష్కారానికి ఈ విభాగాన్ని అదనంగా ఏర్పాటు చేసినందుకు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మాడుగుల జాన్‌ను అభినందించారు. అలాగే జిల్లా కేంద్రంలో సామాన్య, మధ్యతరగతి రోగులకు కూడా అందుబాటులో వైద్యం అందించేలా వైద్యులు పనిచేసి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యసేవలు పూర్తిగా మెరుగుపరిచేలా చర్యలు చేపట్టిందని.. ఇందుకోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నారని గుర్తుచేశారు. దంత వైద్యం కోసం ఉచిత సేవలందించేలా చర్యలు చేపట్టిందని గుర్తు చేశారు. అనంతరం హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ విధానంపై డాక్టర్ జాన్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తూర్పుకాపు సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, స్థానిక డివిజన్ ఇన్‌చార్జి సుంకరి కృష్ణ, వి-డెంటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.జాన్, వైద్యనిపుణులు కె.వి.రామ్మోహనరావు, అనిత, ఓంకార్, ఎస్.సామ్య, తరుణ్, సత్య, వెంకటేష్ పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి క్షీరాభిషేకం

గార: శ్వేతగిరిపై ఉన్న కాళీయ మర్దన వేణుగోపాలస్వామికి జ్యేష్ఠ ఏకాదశిని పురస్కరించుకొని బుధవారం క్షీరాభిషేకం చేశారు. ఆలయ ధర్మకర్త సుగ్గు మధురెడ్డి, అర్చకులు సాయిశర్మ ముందుగా వివిధ అర్చనలు అనంతరం క్షీరాభిషేక సేవ జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అయ్యప్ప స్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: బలగ అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం సందర్భంగా స్వామివారికి క్షీరాభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు దేవకొండ శంకర నారాయణ శర్మ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.